క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటాపురం(కె): మండలంలోని ఆలుబాక, వెంకటాపురం సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సునీల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాను శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపి వేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.

భూమి పూజ



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాల ఆవరణంలో శుక్రవారం ఏటీసీ సెంటర్‌కు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్ మార్చేందుకు కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువస్తుందని అన్నారు. అందులో భాగంగా ఏటీసీలో ఆరు రకాల ట్రేడ్‌లను ప్రవేశ పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కుమారస్వామి, ఏటీఓలు ముఖీన్ కుమార్, నరేష్, పాపారావు సీనియర్ అసిస్టెంట్లు ఎండి సాధిక్, విక్రమ్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

టేకుమట్ల: మాటా, మాటా పెరిగి చోటు చేసుకున్న ఘర్షణలో దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదైన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కుందనపల్లి గ్రామానికి చెందిన సుంకరపెల్లి పూర్ణచందర్‌రావు, పొల్సాని దేవేందర్‌రావు గతంలో కలిసి వ్యాపారం చేశారు. వ్యాపారంలోని పెట్టుబడి, వచ్చిన లాభాల వాటాను ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నావని పూర్ణచందర్‌రావును దేవేందర్‌రావు కోరాడు. నువ్వే నాకు డబ్బులు ఇవ్వాలి అంటూ దేవేందర్‌రావుపై పూర్ణచందర్‌రావుతో పాటు, అతని డ్రైవర్ దాడి చేయగా తీవ్ర గాయాలపాలైనట్లు తెలిపారు. కాగా దేవేందర్‌రావు ఫిర్యాదు మేరకు పూర్ణచందర్‌రావు, అతడి డ్రైవర్ ప్రవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు.

పరామర్శ



రేగొండ: మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన దేశిని లక్ష్మీనారాయణ తండ్రి మల్లయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ ఆపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నెని రవీందర్ రావు శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీలు ఐలి శ్రీధర్, మైస భిక్షపతి ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

మల్హర్: అనారోగ్యంతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాడిచర్లలో చోటు చేసుకుంది. కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం తాడిచర్ల గ్రామానికి చెందిన మేనం నరేష్ (25) తాడిచర్ల ఏఎమ్మార్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నరేష్ ఆరు నెలలుగా ఫైల్స్ సమస్యతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న కూడా తగ్గలేదు. దీంతో బాధ భరించలేక జీవితంపై విరక్తి చెందిన గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్ వాసానికి తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతిడి అన్న రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

గుండెపోటుతో మహిళ మృతి



పలిమెల: గుండెపోటుతో కాపుల పోషక్క(65) మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోడాయిగూడెం గ్రామానికి చెందిన కాపుల పోషక్క శుక్రవారం రేషన్ సరుకులు తీసుకునేందుకు మండల కేంద్రానికి చేరుకుని గుండెలో నొప్పి వస్తుందని, పక్కనే ఉన్న ఇంటికి నీళ్ల తాగేందుకు వెళ్లింది. నీళ్ల తాగకుండానే కుప్పకూలిపోయి మృతి చెందినట్లు తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పోషక్క మృతదేహాన్ని బోడాయిగూడెం గ్రామానికి తరలించారు.

ఆరేళ్లకే శిథిలావస్థకు..

- దెబ్బతిన్న స్త్రీ శక్తి, ఉపాధిహామీ భవనం
- కుంగిన ఫ్లోర్, పగుళ్లు చూపిన గోడలు



గదుల్లో కుంగిన నేల



దెబ్బతిన్న టైల్స్

రేగొండ: ప్రతీ రోజు సమావేశాలు, పలు కార్యక్రమాలతో నిత్యం రద్దీగా ఉండే స్త్రీ శక్తి, ఉపాధిహామీ పథకం భవనం శిథిలావస్థకు చేరింది. సాధారణంగా ఒక భవనం నిర్మిస్తే కనీసం 50 ఏళ్ల వరకు చెక్కు చెదరదు. కానీ మండల కేంద్రంలోని స్త్రీ శక్తి, ఉపాధిహామీ భవనం నిర్మించిన ఆరేళ్లకే శిథిలావస్థకు చేరి గోడలు పగుళ్లు బారాయి, ఫ్లోర్ కుంగి ప్రమాదకరంగా తయారైంది. భవనంలోకి తేళ్లు, పాములు వస్తుండగా సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు.

రూ.42 లక్షల నిధులతో..

ఐకేపీ, ఉపాధిహామీ విభాగాలకు కలిపి రేగొండలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.32 లక్షలు, సీబీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన భవనాన్ని 2018 సంవత్సరంలో అప్పటి స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి ప్రారంభించారు. అప్పటి వరకు అద్దె భవనంలో సాగిన కార్యాలయాలు సొంత భవనంలోకి వెళ్లాయి. ఆ సంతోషం ముణ్నాళ్లు కూడా మిగల్లేదు. కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రారంభించిన కొన్నాళ్లకే గోడలు పగుళ్లుబారాయి, ఫ్లోర్ కుంగింది. ఐకేపీ కార్యాలయంలో వరండాతో పాటు గదుల్లో ఫ్లోర్ కుంగి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో కొందరి సభ్యులకు గాయాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. మరుగుదొడ్డి ఉన్నా నీటి సౌకర్యం లేదని బోరు వేయాలని సమావేశాలకు వచ్చే మహిళలు తెలిపారు. మంచి నీటి సౌకర్యం కూడా లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు భవనానికి మరమ్మతులు చేయించాలని, కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రైతు వేదికలోనే సభలు, సమావేశాలు

మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో 54 గ్రామైఖ్య సంఘాలు, 1132 స్వశక్తి మహిళా సంఘాలు ఉన్నాయి. సుమారు పదకొండు వేల మంది సభ్యులు కొనసాగుతున్నారు. వీరికి ప్రతి నెల ఈ కార్యాలయంలో సంఘాల ఆర్థిక లావాదేవీలపై సమావేశాలు నిర్వహించాలి. కాని స్వశక్తి భవనంలోని మీటింగ్ హాల్‌లో 2018 స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని భద్రపరచారు. దీంతో సమావేశాలను రైతువేదిక కాని, ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నారు..

కార్యాలయానికి నీటి సౌకర్యం లేదు. ఒక బోరు మోటారు ఏర్పాటు చేయాలి. నీటి సరఫరా లేకపోవడంతో మరుగుదొడ్డి నిరుపయోగంగా మారింది. కార్యాలయంలోని అన్ని గదుల్లో ఫ్లోరు కుంగింది. గోడలు పగుళ్లు బారాయి. అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలి.

\- తిరుమల్ సింగ్, ఏపీఎం, రేగొండ

నాయకత్వ లక్షణాలపై అవగాహన



మాట్లాడుతున్న హెచ్ఎం వెంకట్రావ్

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పిల్లాల వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వెంకట్రావ్ పిల్లల హక్కులు, పార్లమెంట్ ఉపయోగాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గొంది హనుమంతు, కామేశ్, ప్రశాంత్, నరేష్, ఉష, పద్మ, ఇందిరా తదితరులు ఉన్నారు.

వీధి లైట్ల ఏర్పాటు



వీధి లైటును వేస్తున్న సిబ్బంది

వాజేడు: మండలంలోని నాగారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం వీధి లైట్లను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల వీధి లైట్లు వెలుగకపోవడంతో వాటి స్థానంలో కొత్త లైట్లను అమర్చారు. వర్షాకాలం కావడంతో లైట్లను అమర్చినట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపారు.

రేపు వైద్యశిబిరం

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లిలో రేపు(ఆదివారం) తమ తల్లిదండ్రులు తుమ్మ కోమలసాంబరెడ్డిల జ్ఞాపకార్థం ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ హెల్త్‌క్యాంప్‌ను మెడికోవర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహిస్తున్నట్లు డా.తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సంజీవరెడ్డి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నబోయినపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఈ హెల్త్‌క్యాంపులో గుండె, ఎముకలు, చిన్నపిల్లలు, చెవి, ముక్కు, గొంతు, జ్వరం, దగ్గు, ఊపిరితిత్తులు, బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులు ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఏజెన్సీ గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం



పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న కౌన్సిలర్లు

భూపాలపల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం లభిస్తుందని 22వ వార్డు కౌన్సిలర్ ముంజాల రవీందర్ అన్నారు. మిషన్‌శక్తి మహిళ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణ పరిధి హనుమాన్‌నగర్-2 అంగన్‌వాడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అక్షరాభ్యాస కార్యక్రమానికి కౌన్సిలర్ రవీందర్‌తోపాటు, 21 వార్డు కౌన్సిలర్ రేణుక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీలో దొరికే పోషక పదార్థాలతో పిల్లలకు భవిష్యత్‌లో విటమిన్ లోపం, అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. మిషన్‌శక్తి మహిళ డిస్ట్రిక్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ అనూష అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపయోగాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ సిబ్బంది మమత, సురేష్, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి అజీత్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో వాస్కులర్ చికిత్స పొందుతున్నాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం కోసం మంత్రి శ్రీధర్‌బాబును కోరడంతో రూ.లక్ష ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు నిమ్స్ ఆస్పత్రిలో ఎల్‌ఓసీ అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



నిల్వ నీటిని పారబోస్తున్న జీపీ సిబ్బంది

టేకుమట్ల: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని పంచాయతీ కార్యదర్శి ఇనగాల సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామకిష్టాపూర్(టి)లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్‌లో భాగంగా గ్రామంలోని ప్రతీ ఇంటిలో కూలర్లు, డ్రమ్ములు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వారంలో ప్రతీ శుక్రవారం ప్రతి ఒక్కరూ నిల్వ నీటిని పారబోసే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. దాని వల్ల దోమల వ్యాప్తిని నివారించవచ్చని అన్నారు. దోమల వల్లనే జ్వరాలు వ్యాపిస్తాయని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కారోబార్ శరత్‌బాబు, అంగన్‌వాడీ టీచర్లు వనిత, స్వరూప, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై శుక్రవారం అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు పలు సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూముల్లో కొనసాగుతున్న నిర్మాణాలను నిలిపివేయించారు. ప్రారంభ దశలో ఉన్న ఇంటి నిర్మాణాలను తొలగించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు కొనసాగించవద్దని ఇంటి నిర్మాణానికి అనుమతి తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు సరికాదు'

కాటారం: మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబుపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని, ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు చీమల సందీప్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం యూత్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సందీప్ మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు పుట్ట మధు అక్రమంగా ఆస్తులు సంపాదించడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా ముందుకుసాగారని దీంతో వరుసగా ప్రజలు బుద్ధి చెపుతూ వస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు, శ్రీనుబాబులకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూడలేక బీఆర్ఎస్ నాయకులు, పుట్ట మధు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని అన్నారు. శ్రీనుబాబు నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని ఆయనకు ఎలాంటి హానీ జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు బందోబస్తు కల్పిస్తున్నారని అన్నారు.

ఇంటి స్థలాలు కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): గోదావరి వరద ముంపు గ్రామాల ప్రజలకు ఇంటి స్థలాలకు కేటాయించాలని కోరుతూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ.. వెంగళరావుపేట, టేకులబోరు, తుర్సవానిగూడెం గ్రామాల్లోని ప్రజలు గోదావరి ముంపునకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ముంపు గ్రామల సమస్యలపై దృష్టి సారించాలని అన్నారు. ముంపు గ్రామల ప్రజలకు వేరే ప్రాంతంలో ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోగిల శ్రీను, నరేంద్ర, బట్ట రవి కుమార్, సురేశ్, నాగేశ్వరావు, ముత్తయ్య తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏటూరునాగారం: సీజనల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రొయ్యూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సుమలత అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం గర్భిణులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం సీజన్‌లో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వేడి ఆహారాలను తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమ తెరలను వినియోగించాలని అన్నారు. వైద్య సిబ్బంది గీత, సరిత, కాశిక ఉన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలి



దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

ములుగు రూరల్: అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పెంచాలని అంగన్‌వాడీల యూనియన్ సహాయ కార్యదర్శి ప్రేమలత అన్నారు. జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు చేపడుతున్న రిలే దీక్ష శుక్రవారం ఏడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన జీఓ విడుదల చేసేంత వరకు అంగన్‌వాడీలను విధుల్లో కొనసాగించాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష బెనిఫిట్ అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సరిత, సూరమ్మ, వెంకటేశ్వరి, ధనలక్ష్మీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు అలవాటు పడొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చక్రపాణి

కాళేశ్వరం: విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని ఎస్సై బి.చక్రపాణి అన్నారు. శుక్రవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎస్సై ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలామంది యువత సరదాగా డ్రగ్స్‌ను మొదలుపెట్టి వ్యసనంగా మారి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు, గుట్కాలు యువత అలవాటు చేసుకోని ఆరోగ్యం పాడుచేసుకోవద్దని తెలిపారు. తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్లు తెలిసిన పోలీసులకు సమాచారం అందిచాలని తెలిపారు. మంచికి దగ్గరగా, చెడుకు దూరంగా ఉండాలని విద్యార్థులు మంచి ఆలోచనలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అన్నపూర్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో రేపు(ఆదివారం) సాయంత్రం నాలుగు గంటలకు ఏర్పాటు చేసే సమావేశాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ చందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి అసోసియేషన్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, జనరల్ సెక్రెటరీ కనుకుల తిరుపతి తదితర నాయకులు హాజరవుతారని తెలిపారు. నూతనంగా భూపాలపల్లి అసోసియేషన్ జనరల్‌బాడీ ఎన్నికలు జరగనున్నయన్నారు. ఈ సమావేశానికి భూపాలపల్లి ఏరియా దళిత అధికారులు, ఉద్యోగులు, కమిటీ సభ్యులు దళిత కార్మికులు హాజరుకావాలని కోరారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



మల్హర్: రమేశ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు



చిట్యాలలో..

మల్హర్: మండలంలోని కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు ఎల్ రమేశ్ నాయక్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం పిల్లలకు నోట్స్ బుక్స్ అందించి, పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు శాంతిలత, నారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని నైన్‌పాక ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ తెలిపారు. బదిలీపై వెళ్లిన ఆలేటి సాంబయ్య, క్యాతమ్ శ్రీధర్, మోత్కూరి లావణ్య, వెంగళ శ్రీధర్, సిరిపురం సతీష్, నూకల లింగయ్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించి వారి అనుభవాల్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదాకర్, ప్రణీత, స్వాతి, విజయశాంతి, పల్లవి, ప్రవీన్‌కుమార్, సుజాత, రమేష్, రాజయ్య, రఘు, సుభాషిణి, ఓదెలు, సీఆర్‌పీ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం



ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న విజయపాల్‌రెడ్డి

మొగుళ్లపల్లి: మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల నందు ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు విజయపాల్ రెడ్డి తెలిపారు. ఈ యూనిట్‌లో ఎన్‌సీసీ ఆఫీసర్ రాజయ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. 8, 9 తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నూతన ఎన్‌సీసీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.